క్లుప్తంగా

అయోధ్య తరలిన భక్తులు



అయోధ్యకు తరలుతున్న రామ భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రం నుంచి అయోధ్యలో బాలరాముని దర్శనానికి వెళ్తున్న భక్తుల ప్రత్యేక వాహనాన్ని రామాలయం వద్ద బుధవారం బీజేపీ మండలాధ్యక్షుడు విఠల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు శ్రావణ్, కృష్ణ ఆర్ఎస్ఎస్ బాధ్యులు సీతారామారావు, వీరప్ప, సంతోష్ కుమార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నచ్చిన క్రీడల్లో రాణించాలి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులు నచ్చిన క్రీడల్లో రాణించాలని శివ్వంపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం బాలచంద్రం అన్నారు. బుధవారం విద్యార్థులకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం కనబరచాలన్నారు. క్రీడలు, వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు స్వయం పాలన దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బండ్ల ఊరేగింపు



బండ్ల ఊరేగింపులో భక్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని వెల్పుగొండ గుట్టపై వెలసిన తుంబురీశ్వరాలయ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం తుంబురీశ్వరుడికి నందాదీపారాధన, పుణ్యవచనము, కలశస్థాపనము, రుద్రాభిషేకం, హనుమదభిషేకం వంటి ప్రత్యేక పూజలను నిర్వహించారు. బండ్ల ఊరేగింపు కనుల పండువగా సాగింది. అనంతరం రాత్రి వేళ ఉత్తర పూజ, భజనలు చేశారు. ఆలయం ఎదుట శివలింగం, అలంకరణలు అందరిని ఆకట్టుకున్నాయి. రాత్రి వేళలో బోనాలను ఊరేగించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, పొలు, శ్రీనివాస్‌గౌడ్, రాములు, యోగేందర్, రాఘవేందర్, సాయగౌడ్, రంజా, సాయిలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్ల అందజేత



బాలింతలకు కిట్లు అందిస్తున్న నాగమణి

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రం అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో నిర్వహించారు. బాలింతలకు న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నాగమణి మాట్లాడుతూ.. బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదన్నారు. బాల్య వివాహాలతో బాలికల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. మహిళలను లైంగిక వేధింపులకు గురి చేసే వారిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సారిక, హెల్త్ సూపర్‌వైజర్ నరసమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, మహిళా సాధికారిత కేంద్రం జనరల్ స్పెషలిస్ట్ నాగమణి, కవిత, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



అంజయ్య

టేక్మాల్(మెదక్): వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని కోరంపల్లిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఏఎస్ఐ తుక్కయ్య తెలిపిన వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన కొండ అంజయ్య(55) వ్యవసాయంతో పాటూ గేదెలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. నిత్యం మాదిరిగానే ఈనెల 20న సాయంత్రం గేదెలను మేతకు తీసుకొచ్చి ఇంటి వద్ద కట్టేస్తుండగా గేదెలను కొట్టాడు. గేదెలను ఎందుకు కొడుతున్నావని అంజయ్య వదిన రుక్కమ్మ తిట్టింది. దీంతో అతను రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకి లభించలేదు. అంజయ్య ఇంటి నుంచి వెళ్లినప్పుడు తెల్ల షర్టు, తెల్ల దోతితో నలుపురంగులో ఉన్నట్లు తెలిపారు. కుమార్తె కొండ స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాగ్రత్తలు తప్పనిసరి

- పిచికారీ తర్వాత స్ప్రేయర్‌లను శుభ్రం చేయకపోతే పంటలకు నష్టం
- మండల వ్యవసాయాధికారి రాజశేఖర్



వెల్దుర్తి(తూప్రాన్): పంటలకు సోకే వివిధ రకాల చీడపీడల నివారణకు రైతులు వివిధ రకాల స్ప్రేయర్‌లను వాడుతుంటారు. మార్కెట్‌లో వివిధ రకాల స్ప్రేయర్లు అందుబాటులో ఉన్నాయి. రైతులు వీటిని ఉపయోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. చిన్న, చిన్న జాగ్రత్తలు పాటిస్తే స్ప్రేయర్‌లు ఎక్కువకాలం మన్నుతాయని మాసాయిపేట మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ పలు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా వరిపంట సాగవుతుంది. పంటకు మందులు పిచికారీ చేసిన అనంతరం స్ప్రేయర్‌లను జాగ్రత్తగా శుభ్రపరిచి భద్రపరచాలి. జిల్లాలోని పలుగ్రామాల్లో రైతులు జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల గతంలో వరి పంట ఎండిపోయిన దృష్ట్యా రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

హ్యాండ్ స్ప్రేయర్లు

మందుల పిచికారీ పూర్తికాగానే శుభ్రమైన నాలుగు లీటర్‌ల మంచినీటిని ట్యాంకులో పోసి నాజిల్ ద్వారా బయటకు పంపాలి. తర్వాత స్ప్రేయర్ గొట్టం తీసి ఇంజన్ ఆయిల్ పోసి మళ్లీ బిగించాలి. ఇలా చేయడం ద్వారా గొట్టం తుప్పు పట్టకుండా ఉంటుంది.



పంటకు మందు పిచికారీ చేస్తున్న రైతు

హైటెక్ స్ప్రేయర్లు

మూడు లీటర్ల నీటిని పోసి శుభ్రంగా నాజిల్ ద్వారా బయటకు పంపి శుభ్రపరచాలి. పంపును తలకిందులుగా ఉంచి బుష్‌లు ఉన్నచోట గొట్టం వద్ద ఇంజన్ ఆయిల్ చుక్కలు వేసి పూయాలి.

పవర్ స్ప్రేయర్లు

మందుల పిచికారీ సమయం ముగియగానే పవర్ స్ప్రేను మంచినీటితో శుభ్రం చేయాలి. ట్యాంకులో పెట్రోల్ లేకుండా చూసుకోవాలి. టర్బోరేటర్ గిన్నెలోనూ పెట్రోల్ లేకుండా చేయాలి. ప్లగ్ తీసి పెట్రోల్‌తో శుభ్రంగా కడగాలి. పిస్టిన్‌పై 5,6 చుక్కల ఇంజన్ ఆయిల్ వేసి ప్లగ్‌ను బిగించాలి. ఇలా చేస్తే పిస్టిన్ పాడైపోకుండా ఉంటుంది.

తైవాన్ స్ప్రేయర్‌లు..

తైవాన్ స్ప్రేయర్‌లో ఐదు లీటర్ల మంచి నీటిని పోయాలి. ఇంజన్ స్టార్ట్ చేసి నాజిల్ ద్వారా బయటకు పంపాలి. ఇలా చేయడం వలన పైప్‌తో పాటు నాజిల్ మలినాలు లేకుండా శుభ్రం అవుతుంది. ట్యాంకులో పెట్రోల్ లేకుండా తీయాలి. ప్లగ్‌ను తీసి పిస్టిన్‌పై ఐదు చుక్కల ఆయిల్ వేసి బిగించాలి. పంపు భాగాలన్నింటినీ శుభ్రంగా తుడిచి భద్రపరచాలి.

రీచార్జబుల్ స్ప్రేయర్‌లు..

మందులు పిచికారీ చేయడం పనులు పూర్తయిన వెంటనే మూడు లీటర్ల నీటిని ట్యాంకులో పోసి బయటకు పంపాలి. ప్రతీ 15 రోజులకు ఒకసారి గంట పాటు చార్జింగ్ పెట్టాలి. ఇలా చేయడం వల్ల బ్యాటరీ డిశ్చార్జ్ కాకుండా పది కాలాల పాటు మన్నికగా ఉంటుంది. వచ్చే ఏడాది సైతం మెకానిక్ అవసరం లేకుండా పనిచేస్తుంది. రైతులు ఇలాంటి జాగ్రత్తలను పాటించి స్ప్రేయర్‌లను భద్రపరుచుకోవాలి.

రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తే కఠిన చర్యలు

సీఐ రేణుక

అల్లాదుర్గం(మెదక్): రాంగ్ రూట్‌లో ప్రయాణించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అల్లాదుర్గం సీఐ రేణుక హెచ్చరించారు. మంగళవారం రాత్రి 161 హైవేపై వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గడిపెద్దాపూర్ వద్ద రాంగ్ రూట్‌లో బైక్‌పై రావడంతో కారు ఢీకొని మృతి చెందిన విషయం గుర్తు చేశారు. మద్యం సేవించి రాంగ్‌రూట్‌లో ప్రయాణించే వారిపై జరిమానాలతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. రాంగ్ రూట్ ప్రయాణంతోనే నిండు ప్రాణాలు బలై, కుటుంబాలు వీధిన పడుతున్నాయని చెప్పారు.



డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తున్న అల్లాదుర్గం సీఐ

ఇష్టం రాజ్యంగా వాహనాలు నడుపుతూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఇందులో ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి ఉన్నారు.

సిద్ధిరామేశ్వర ఆలయంలో పూజలు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని వాడి గ్రామంలో సిద్ధిరామేశ్వర దేవాలయ వార్షికోత్సవం ఘనంగా జరుగుతోంది. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు బుధవారం ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు యామిరెడ్డి, ఎంపీటీసీ సిద్ధిరెడ్డి, శ్రీనివాస్, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి

ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తాం

మైనంపల్లి హన్మంతరావు

చిన్నశంకరంపేట(మెదక్): ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం మండలంలోని చందాపూర్ గ్రామంలో తల్లి లేదా తండ్రి లేని చిన్నారులకు ఎంఎస్ఎస్ఓ ద్వారా రూ.25 వేల చొప్పున డిపాజిట్ చేసిన బాండ్లను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యలక్ష్మి, సిద్ధిరాములు, రాజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, సురేందర్‌నాయక్, ప్రభాకర్, భిక్షపతి, రాజాసింగ్ ఉన్నారు.



డిపాజిట్ బాండ్లు అందిస్తున్న హన్మంతరావు

ఆరోగ్యానికి గోఆధారిత ఉత్పత్తులు

- గోసేవ ప్రముఖ్ రాఘవన్
- తునికి కేవీకేలో గోఆధారిత వ్యవసాయం, ఉత్పత్తులపై శిక్షణ

కౌడిపల్లి(నర్సాపూర్): మంచి ఆరోగ్యం కోసం గోఆధారిత ఉత్పత్తులు వాడాలని గోసేవ ప్రముఖ్ రాఘవన్ తెలిపారు. బుధవారం మండలంలోని తునికి కేవీకేలో రెండో రోజు రైతులకు గోఆధారిత వ్యవసాయం, ఉత్పత్తులపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆవుపేట ఇతర పదార్థాలతో పంచగవ్య టూత్ పౌండర్, , దూప్‌బత్తి, బాత్ పౌండర్, ఫేస్ పౌండర్, డిష్ వాష్ తదితర ఉత్పత్తులను తయారు చేయవచ్చన్నారు. తయారు చేసే విధానాన్ని ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. వీటిని వాడటంతో ఆరోగ్యం, పరిసరాలు బాగుంటాయని చెప్పారు. తక్కువ ఖర్చుతో



గోఆధారిత ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

తయారు చేయవచ్చని చెప్పారు. గోఆధారిత వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం చేసి, నేల సారాన్ని రక్షించాలన్నారు. నేల బాగుంటే రైతు భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. రసాయనాల వాడకం తగ్గిస్తూ సేంద్రియ సాగు, ప్రకృతి సాగు చేయాలన్నారు. నేల గో ఆధారిత సాగుకు అలవాటు పడితే దిగుబడి సైతం అధికంగా వస్తుందని చెప్పారు. రైతులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని గోఆధారిత వ్యవసాయం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో గోసేవ ప్రముఖ్ రామారావు, కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్, శాస్త్రవేత్తలు రవికుమార్, శ్రీనివాస్, ఉదయ్‌కుమార్, భార్గవి, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

40 ఏళ్ల తర్వాత దుకాణాలకు రీటెండర్

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని పాత బస్టాండ్ ఎదుట ఉన్న 17 మున్సిపల్ దుకాణాలకు 40 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో రీ టెండర్లు నిర్వహించారు. ఈ బహిరంగ వేలం కార్యక్రమానికి జిల్లా మైనింగ్ అధికారి జయరాజు, జిల్లా పరిశ్రమల మేనేజర్ కృష్ణమూర్తి పరిశీలకులుగా వ్యవహరించారు. మొత్తం 58 మంది దరఖాస్తు చేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ జానకీరాంసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా 58 మందిలో అత్యధికంగా వేలం పాడిన వారికి అధికారులు ధ్రువ పత్రాలు అందజేశారు. కొన్నేళ్లుగా మున్సిపల్ దుకాణాల రీ టెండర్ కోసం దరఖాస్తుల ప్రక్రియ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు చొరవతో ప్రారంభమైనట్లు సమాచారం. గతంలో ఈ దుకాణాలకు కేవలం రూ.83 వేలు వచ్చేది. ఇప్పుడు రీటెండర్ల ద్వారా మొత్తం నెలకు రూ. 5.13 లక్షల ఆదాయం బల్దియాకు రానుంది.



లబ్ధిదారుడికి ధృవపత్రం అందిస్తున్న అధికారులు

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

మెదక్ కలెక్టరేట్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇస్తామని స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ కేంద్రం డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్ బుధవారం తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. వివరాల కోసం 94901 03390, 94901 29839 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నిధులు మంజూరు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ. కోటి ముప్పై లక్షల నిధులు మంజూరు అయినట్లు కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, టీజేఎస్ జిల్లా నాయకుడు బాల్‌రాజ్‌గౌడ్ తెలిపారు.

తాగునీటి సమస్య

నర్సాపూర్ రూరల్: మండలంలోని రెడ్డిపల్లిలో వారం రోజులుగా తీవ్ర తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. మిషన్ భగీరథ సరఫరా అయ్యే పైపులైన్లకు బిగించిన వాల్స్ పాడైపోవడంతో వారం రోజులుగా 4, 5 వార్డుల నీటి సరఫరా నిలిచిపోయింది. కనీసం రెండు వార్డుల ఫలితంలో ఉన్న జెట్ పంపు సైతం పని చేయకపోవడంతో తీవ్ర తాగునీటి సమస్య నెలకొంది. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామన్నారు. అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి సునీతను వివరణ కోరగా.. మిషన్ భగీరథ పైప్ లైన్‌కు ఉన్న వాల్‌కు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు.



ఖాళీ బిందెలతో మహిళలు

ఉపాధి పనుల్లో అవకతవకలు

తూప్రాన్: మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో రూ.1,19,408 లక్షల అవతవకలు జరిగినట్లు బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్‌లో అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ విరోజ మాట్లాడుతూ.. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి పనుల్లో రూ.4.08 కోట్ల పనులు చేపట్టినట్లు వివరించారు. ఈ పనుల్లో సామాజిక తనిఖీలో రూ.1.19 లక్షల వరకు అవతవకలు గుర్తించామన్నారు. ఈ అవతవకలకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.7వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ ప్రభాకర్, క్యూసీ రామాకాంత్, ఎంపీపీ స్వప్న, ఎంపీడీఓ వెంకటరాంరెడ్డి, ఎస్ఆర్‌పీ శ్రీకాంత్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న అధికారులు

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



పాపన్నపేట(మెదక్): కుర్తివాడ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



టేక్మాల్(మెదక్): కుసంగిలో ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



నర్సాపూర్ రూరల్: బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కుర్తివాడ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవం జరిగింది. కలెక్టర్‌గా హర్షవర్ధన్, డీఈఓగా జశ్వంత్, ఎంఈఓగా బిందు, హెచ్ఎంగా స్పందన, ఉపాధ్యాయులుగా దివ్య, వరలక్ష్మి, దుర్గేశ్, వరలక్ష్మి, లక్ష్మణ్, నిఖిలాష్,అజయ్, దుర్గేష్ తదితరులు వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన వారికి హెచ్ఎం శ్రీనివాస్ రావు, టీచర్లు అంజాగౌడ్, నాగభూషణం, కుమార్, శివలింగాగౌడ్, బూలిబాయి బహుమతులు అందజేశారు.

కుసంగిలో..

టేక్మాల్(మెదక్): మండలంలోని కుసంగి ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం విశ్వనాథం, ఉపాధ్యాయులు గోవర్ధన్ రాథోడ్, సుధారాణి, మహేశ్, శ్రీనివాస్, సమీర్, మల్లీశ్వరి, మల్లేశ్‌గౌడ్, కృష్ణ, శ్రీను తదితరులు ఉన్నారు.

చండి ఉన్నత పాఠశాలలో..



చేగుంట(తూప్రాన్): రెడ్డిపల్లిలో..



శివ్వంపేట(నర్సాపూర్): చండి పాఠశాలలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చండి ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వామనశర్మ, దయానంద్‌రెడ్డి, సంతోష్ కుమార్, అరుణ, రోజ్‌మేరీ, హేమలత ఉన్నారు.

బ్రాహ్మణపల్లి పాఠశాలలో..

నర్సాపూర్ రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకొన్నారు. హెచ్ఎం శ్రీశైలం, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

రంగాయపల్లి ఉన్నత పాఠశాలలో..

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో, రంగాయపల్లి ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని విద్యార్థులు నిర్వహించారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం, ఇబ్రహీంపూర్, రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల్లో, పోతాన్‌పల్లి, రాంపూర్ ప్రాథమిక పాఠశాలల్లో స్వయం పాలన దినోత్సవం జరుపుకొన్నారు.

కొత్తపల్లిలో మాతృభాష దినోత్సవం



కవితలు చదువుతున్న విద్యార్థిని

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం జరుపుకొన్నారు. భాషా పండితులు స్వరణ, లలిత విద్యార్థులకు కవితలు, పద్యాలు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతుల అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేందర్, నోడల్ అధికారి ప్రతాప్‌రెడ్డి, టీచర్లు మాధవరెడ్డి, సోమశేఖర్, శ్రీనివాస్, ప్రసాద్‌రెడ్డి, తులసీరాం, మధు, దుర్గారాములు, సంజిదా, సుహాసిని, కళావతి, స్వాతి పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, పాటలు, పద్యాలు, శ్లోకాల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు హెచ్ఎం నీరజ బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలిత, రాధ, సరస్వతి, రాథోడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ డీఎస్పీ బదిలీ

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ డీఎస్పీ ఫణీంద్ర బదిలీ అయ్యారు. కొంతకాలం క్రితమే బదిలీపై వచ్చిన ఆయన సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బదిలీ అయ్యారు. అలాగే డాక్టర్ రాజేశ్వర్‌ను మెదక్ డీఎస్పీగా రాష్ట్ర పోలీస్ అడ్మినిస్ట్రేటర్ అధికారి మంజుల పాల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

◆ సీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ

నర్సాపూర్ రూరల్: మండలంలోని నత్నయపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీరాముని ఆలయంలో బుధవారం సీతారామ లక్ష్మణ విగ్రహాలతో పాటు నవగ్రహాలను ఘనంగా ప్రతిష్ఠించారు. ఉదయం గణపతి పూజ, యంత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి విగ్రహ ప్రతిష్ఠలు, సీతారాముల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘువీరారెడ్డి, గ్రామస్తులు నగేష్, ఉదయ్, ఎల్లం, పురుషోత్తం, మహేశ్, పోచన్న, అశోక్, శ్రీకాంత్, భిక్షపతి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

◆ నేటి నుంచి రాజిపేటలో ఆలయ వార్షికోత్సవాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేటలో ఆంజనేయస్వామి ఆలయం ప్రథమ వారిషకోత్సవాలు ఈనెల 22, 23వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు బుధవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 22న గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవచనం, మంటపారాధన, స్వామివారికి అభిషేకం, హోమం జరుగుతాయన్నారు. 23న సీతారామచంద్రస్వామి కల్యాణం , పల్లకీసేవ, ఉంటుందన్నారు.

పొంగిపొర్లుతున్న చెక్‌డ్యాంలు

తూప్రాన్: యాసంగిలో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం మల్లన్న సాగర్ నుంచి హల్దీవాగులో నీటిని బుధవారం వదిలారు. దీంతో మండలంలోని యావపూర్ నుంచి నాగులపల్లి వరకు హల్దీ వాగుపై ఉన్న చెక్‌డ్యాంలు పొంగిపోర్లుతున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

◆ త్రుటిలో తప్పిన ప్రమాదం

శివ్వంపేట(నర్సాపూర్): బస్టాండ్‌లోకి లారీ దూసుకెళ్లిన సంఘటన తూప్రాన్ – నర్సాపూర్ హైవే చండి వద్ద బుధవారం చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో బస్టాండ్‌లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సంగారెడ్డి నుంచి కరీంనగర్ వైపుకు వెళ్తున్న డ్రైవర్ వెంకట్‌రమణకు నిద్రమత్తు రావడంతో లారీ బస్టాండ్‌లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో బస్టాండ్ స్వల్పంగా దెబ్బతింది.

◆ వంట మనిషి కావాలి

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సహాయ వంట మనిషి కావాలని పాఠశాల స్పెషల్ అధికారి కృష్ణతేజ తెలిపారు. బుధవారం పాఠశాలలో ఆమె మాట్లాడుతూ.. తూప్రాన్, మనోహరాబాద్ మండలానికి చెందిన వారు కనీసం 7వ తరగతి చదివిన మహిళ కావాలన్నారు.

◆ విద్యార్థులు ఇష్టంతో చదవాలి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే లక్ష్యాన్ని చేరుతారని ప్రిన్సిపాల్ వెంకటరామరావు తెలిపారు. బుధవారం కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు శ్రీకాంత్, మంగమ్మ, శ్రీలత, గిరిధర్‌రావు, సురేందర్‌రెడ్డి, మనికాంత్‌రావు, దుర్గయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారులు పనిచేయాలని ఎంపీపీ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి కోరారు. బుధవారం చిన్నశంకరంపేటలో గ్రామ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేక అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కోరారు. గ్ర కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదర్, తహసీల్దార్ మన్నన్, ఎంపీఓ గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ శ్రీశైలంకు స్వాముల పాదయాత్ర

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన శివ స్వాములు బుధవారం శ్రీశైలానికి పాదయాత్రగా తరలి వెళ్లారు.

◆ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పెద్దశంకరంపేట(మెదక్): సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. బుధవారం మాణిక్య ప్రభు ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ధూప దీప నైవేద్యంలో పనిచేస్తున్న కొత్తగా ఎన్నికైన వారికి సీఎం ఐదు నెలల వేతనాలను విడుదల చేశారు. దీంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.